సాక్షి
జనగామ
శనివారం । 24 । ఆగస్టు । 2024



'ఓపెన్'గా చదివేద్దాం - 8లో ▸

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఈ విద్యాసంవత్సరానికి గాను డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చని వర్సిటీ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.



ప్రజల దృష్టి మరల్చేందుకే పరస్పర ఆరోపణలు - 8లో ▸

ప్రజా సమస్యల నుంచి దృష్టిని మరల్చేందుకే బీఆర్ఎస్, బీజేపీ ఆరోపణలు చేసుకుంటున్నాయని సీపీఐ నేత నారాయణ అన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32⁰ /24⁰

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి.

న్యూస్‌రీల్

ఒగ్గు రవికి 'జానపద సామ్రాట్' అవార్డు



లింగాలఘణపురం: మాణిక్యాపురం గ్రామానికి చెందిన ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ జాతీయ పురస్కార గ్రహీత ఒగ్గు రవికి రైటర్స్ అకాడమీ 'జానపద సామ్రాట్' అవార్డు ప్రదానం చేసింది. ఈనెల 22న ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత సాంస్కృతిక కమిషన్, తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విశాఖపట్నంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర జానపద జాతర కార్యక్రమంలో ఈ అవార్డు అందజేశారు. యువ కళాకారుడు ఒగ్గు రవి ఒగ్గు కళకు అందిస్తున్న సేవలను గుర్తించి అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, హోం మంత్రి వంగలపూడి అనిత, హాస్యబ్రహ్మ బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

26న శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

జనగామ: జిల్లాకేంద్రంలోని హైదరాబాద్ రోడ్డున ఉన్న ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో ఈనెల 26న ఉదయం 10.30 గంటలకు బాలభారతి ఆధ్వర్యాన శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఒకటి నుంచి 5 తరగతుల పిల్లలకు వేషధారణ, 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు నృత్య పోటీలు(శ్రీ కృష్ణునికి సంబంధించిన) ఉంటాయని నిర్వాహకులు త్రిపురారి సూర్యప్రసాద్ పద్మ తెలిపారు. పాల్గొనే పిల్లలు శనివారం(రేపు) ఉదయం 11 గంటల లోపు వాట్సాప్ నంబర్ 9652408848లో వివరాలు, అంశం తెలుపుతూ మెసేజ్ పంపించాలన్నారు. ముందస్తుగా నమోదు చేసుకున్న వారికి మాత్రమే పోటీలో పాల్గొనే అవకాశం కల్పిస్తామని, విజేతలకు బహుతులను అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

అర్హులైన రైతులకు రుణమాఫీ : డీఏఓ



లింగాలఘణపురం: అర్హులైన రైతులందరికీ తప్పకుండా రుణమాఫీ అవుతుందని డీఏఓ రామారావునాయక్ అన్నారు. శుక్రవారం బండ్లగూడెం రైతు వేదికను సందర్శించిన ఆయన రుణమాఫీ కాని రైతుల నుంచి వస్తున్న దరఖాస్తుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, అర్హులందరికీ రుణమాఫీ జరుగుతుందని చెప్పారు. అనంతరం నూతనంగా జిల్లాకు వచ్చిన డీఏఓను రైతులు సన్మానించారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వర్లు, ఏఈఓ స్పందన, వెన్నెల పాల్గొన్నారు.

డీఎస్‌ఓను కలిసిన రైస్ మిల్లర్లు



జనగామ: జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన సరస్వతిని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూరల్ అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఆయన వెంట మిల్లర్లు సిద్దిరాజు, పెండ్లి సంపత్, చేడొంగ నరహరి, బొగ్గారపు నాగరాజు, అయిత సిద్దినర్సయ్య, రాజిరెడ్డి, సందీప్ ఉన్నారు.

గంగమ్మకు తెప్ప బోనం



లింగాలఘణపురం: సమృద్ధిగా వర్షాలు కురిసి.. కుంటలు, చెరువులు నిండి ప్రజలంతా పాడి పంటలతో సంతోషంగా ఉండాలని కోరుతూ గంగపుత్రులు గంగమ్మకు తెప్ప బోనం సమర్పించారు. మండల కేంద్రంలో శుక్రవారం గంగపుత్రులు పాత చెరువు గంగమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఇటుకల కొండయ్య, శ్రవణ్‌కుమార్, యాదగిరి, శ్రీశైలం, సాయిబాబా, రాజు, సాయిలు, సత్యనారాయణ, బాలకృష్ణ, భాస్కర్, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పైరవీలకు ప్రైవేట్ వ్యక్తులు

గాడి తప్పిన 'పుర'పాలన

- సెటిల్మెంట్లకు అడ్డాగా మారిన జనగామ మున్సిపాలిటీ
- ఇంటి నిర్మాణ అనుమతుల్లో మధ్యవర్తిత్వం..!
- ప్రైవేట్ వ్యక్తుల ద్వారా ఒప్పందాలు.. వినకుంటే లొంగదీసుకునే ప్రయత్నం
- ఏసీబీకి చిక్కినా మారని తీరు
- మరోసారి దృష్టి పెట్టిన అధికారులు



జనగామ: జనగామ మున్సిపాలిటీలో పాలన గాడి తప్పింది. ఒకప్పుడు అభివృద్ధి, పరిపాలనలో వెలుగు వెలిగిన పురపాలిక.. నేడు అక్రమాలకు కేంద్ర బిందువుగా మారింది. ఇంటి నిర్మాణాల నుంచి మొదలు అభివృద్ధి పనుల వరకు సెటిల్మెంట్లకు అడ్డాగా మారింది. ప్రజల సమస్యలను గాలికి వదిలేసిన అధికారులు.. ప్రైవేటు వ్యక్తులతో చేతులు కలిపి అందినకాడికి దండుకుంటున్నారు. లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కి జైలుకు వెళ్లినా.. అవినీతి అక్రమాల ఫిర్యాదులతో బదిలీ అయినా తీరు మారడంలేదు.

యథావిధిగా ఎంక్రోచ్‌మెంట్లు

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంక్రోచ్‌మెంట్లను గుర్తించేందుకు పురపాలికల్లో టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసింది. పట్టణ పరిధి 30 వార్డుల్లో నిర్మాణాలను తనిఖీ చేశారు. ఇందులో పలుచోట్ల ఎంక్రోచ్‌మెంట్లు జరుగుతున్నట్లు గుర్తించిన టాస్క్‌ఫోర్ బృందం జేసీబీలతో వాటిని పాక్షింగా కూల్చి వేసింది. అయితే ఆ నిర్మాణాలు ఇప్పుడు యథావిధిగా ఉండడం గమనార్హం. ఇందులో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలు ఎన్ని, నిలిపివేసిన వాటి వివరాల నివేదికలు కనిపించకుండా పోయాయి.

అంతా అవినీతిమయం..

గతంలో ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన రవీందర్ మూడేళ్ల నిధుల ఆడిట్ పెండింగ్, ఎంబీ రికార్డుల మాయం, నాసిరకం పనులు ఇలా అనేక ఆరోపణలు ఎదుర్కొని బదిలీపై వెళ్లారు. మొన్నటి కమిషనర్ రజిత, ఆమె డ్రైవర్ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కి జైలుకు వెళ్లారు. మరణ ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు తిరిగి పోస్టింగ్ ఇచ్చిన ఘనత జనగామ పురపాలికకే దక్కుతుంది. ఇక్కడికి వచ్చిన వారు దోచుకోవడం తప్ప.. పట్టణ అభివృద్ధిపై దృష్టిపెట్టేవారే లేరని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

దళారులదే హవా..

పురపాలికలో దళారుల హవా కొనసాగుతోంది. బిల్లు చేయడం లేదా.. ఇంటి నిర్మాణ అనుమతికి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే తిరస్కరించారా.. ఎప్పుడో చనిపోతే ఇప్పుడు(స్థానికత కాకున్నా) డెత్ సర్టిఫికెట్ కావాలా.. ఇప్పించడానికి మేమున్నాం.. డబ్బులు ఇస్తే పనైపోతుందంటూ కొందరు దందాకు తెరలేపారు. అధికారులను మచ్చిక చేసుకుని ఇంటి నిర్మాణ అనుమతుల సమయంలో చిన్న చిన్న సాంకేతిక సమస్యలను సాకుగా చూపి తిరస్కరించేలా చేస్తున్నారు. బాధితులు మధ్యవర్తుల వద్దకు వెళ్లేలా చేస్తూ ఇంటి నిర్మాణాన్ని బట్టి రూ.లక్ష నుంచి రూ.4లక్షల వరకు ముట్టజెప్పేలా సెటిల్మెంట్ చేస్తున్నారు. ఇందుకు అంగీకరించకుంటే ఇంటి యజమానులపైకి ప్రైవేటు వ్యక్తులను పురిగొలుపుతూ.. వారితో ఫిర్యాదులు చేయిస్తూ లొంగదీసుకునే ప్రయత్నం చేస్తున్నారని పలువురు బాధితుల ద్వారా తెలిసింది.

ఏసీబీ అధికారుల నజర్



ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు పురపాలికపై తిరిగి దృష్టి సారించినట్లు సమాచారం. ఇటీవల ఎస్సీ బాలికల ప్రీ, పోస్టు మెట్రిక్ వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఆ శాఖ అధికారులు.. పురపాలికకు వచ్చి పలువురిని విచారించినట్లు విశ్వసనీయ సమాచారం. లంచం ఇవ్వనిదే పని జరిగే పరిస్థితి లేకపోవడంతో బాధితులు ఏసీబీని ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తున్నది.

అక్రమార్కులకు సిరుల పంట



జనగామ మున్సిపాలిటీ అక్రమార్కులకు కల్పతరువుగా మారింది. నిర్మాణ అనుమతుల విషయంలో దళారుల పైరవీరులు మితిమీరి పోయాయి. ఇంటి నిర్మాణం చేసుకునే యజమానులకు అనుమతులు కోరే సమయంలో కనీస ఇబ్బందులు లేకుండా చూడాలి.

- గాదెపాక రాంచందర్, కాంగ్రెస్ మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్

అవినీతి మితిమీరి పోతున్నది..



పురపాలికలో దళారుల బెడద రోజురోజుకూ మితిమీరి పోతున్నది. అక్రమమైనా.. సక్రమమైనా పని చేసిపెడతామంటూ బహిరంగంగా చెబుతున్నారు. పురపాలిక పరిధిలో ఇటీవల ఇంటి నిర్మాణ అనుమతులకు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తుల్లో ఎన్ని తిరస్కరించారు.. ఎన్నింటికి అనుమతులిచ్చారనే విషయమై విచారణ చేపట్టాలి.

- మహంకాళి హరిశ్చంద్రగుప్త, బీజేపీ ఫ్లోర్‌లీడర్

నూరు శాతం పైరవీలే..



మున్సిపాలిటీలో ఏ పనీ సక్రమంగా జరగడలేదు. నూరు శాతం పైరవీలే. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అధికారులు ఆడింది ఆట పాడింది పాటగా నడుస్తోంది. కమిషనర్ వార్డులు తిరగడం లేదు. శానిటేషన్ అధ్వానంగా మారింది. ఇంటి నిర్మాణ అనుమతుల విషయంలో ప్రత్యేక టీం ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలి.

- ముస్త్యాల దయాకర్, బీఆర్ఎస్ కౌన్సిలర్

సక్రమంగానే నడుస్తోంది..



పురపాలికలో పైరవీలు లేవు. దళారులు లేరు. అంతా సక్రమంగానే నడుస్తోంది. ఇంటి నిర్మాణానికి ఆన్‌లైన్ దరఖాస్తు రాగానే కరెక్టుగా ఉంటే అనుమతులు ఇస్తున్నాం. ఎవరి ప్రమేయం ఉండదు. డాక్యుమెంట్లు సక్రమంగా లేకుంటే సరి చేసుకోవాలని చెబుతున్నాం.

- వెంకటేశ్వర్లు, కమిషనర్, జనగామ

గవర్నర్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం



ఆడిటోరియంను పరిశీలిస్తున్న బుర్రా వెంకటేశం కలెక్టర్, అదనపు కలెక్టర్లు

జనగామ రూరల్: జిల్లాలో ఈ నెల 29న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం అన్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్‌తో కలిసి జనగామ మండలం ఓబుల్‌కేశ్వాపూర్‌లోని ఆడిటోరియంను పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు చెందిన 20 మంది రచయితలు, కళాకారులు, జాతీయ, రాష్ట్ర పురస్కార గ్రహీతలతో సమావేశం ఏర్పాటు చేయాలని చెప్పారు. రోడ్లకు మరమ్మతులు, భోజన వసతులు, తాగునీరు తదితర సదుపాయాలు కల్పించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని చెప్పారు. తర్వాత గ్రామంలోని పాఠశాలలను సందర్శించి అభివృద్ధి పనుల గురించి తెలుసుకున్నారు. డిజిటల్ తరగతుల నిర్వహణను పరిశీలించారు. అంతకు ముందు కలెక్టరేట్‌లోని వివిధ శాఖల కార్యాలయాలను వారు సందర్శించారు.

విద్యార్థులకు ఇబ్బందులు ఉండొద్దు

- అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, ఇతర అధికారులు

జనగామ రూరల్: సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకుండా చూడాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. ఆయన శుక్రవారం సివిల్ సప్లయీస్ అధికారులతో కలిసి పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో వారు ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం స్టాక్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయీస్ డీఎం హథీరాం, డీఎస్ఓ సరస్వతి, డీటీ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి



జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

జనగామ రూరల్: గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 28 ఉద్యోగుల పాలిట శాపంగా మారిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఓల్డ్ పెన్షన్ స్కీం(ఓపీఎస్) అమలు చేయాలని టీఎస్‌సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్షుడు కాకాని లక్ష్మణమూర్తి అన్నారు. ఈ విషయమై శుక్రవారం బ్లాక్ డే పాటిస్తూ ఉపాధ్యాయ సంఘాలు, ఉద్యోగులు ఆయా కార్యాలయాల్లో భోజన విరామ సమయాన నల్ల బ్యాడ్జీలు ధరించి జిల్లా వ్యాప్తంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు గత ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని, సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు. కార్యక్రమంలో శశిధర్, లింగమూర్తి, కుమారస్వామి, సునిల్‌కుమార్, కిష్టయ్య, శారద, స్వప్న, శ్యాంసుందర్, రాజారాం సారయ్య తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ జీఆర్పీలో బదిలీలు

కాశిబుగ్గ: వరంగల్ ప్రభుత్వ రైల్వే పోలీస్(జీఆర్పీ) స్టేషన్‌లో బదిలీలు జరిగాయి. వరంగల్ జీఆర్పీ నూతన సీఐగా పి.సురేందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ సీసీఎస్‌లో పనిచేస్తున్న సురేందర్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ జి.నరేష్ మల్టీజోన్-1 ఐజీకి రిపోర్టు చేయాలని, అదేవిధంగా ఎస్సై ఐలయ్య కూడా జోన్ ఐజీకి రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా వచ్చిన సీఐకి సిబ్బంది అభినందనలు తెలిపారు. బదిలీపై వెళ్తున్న సీఐ నరేష్, ఎస్సై ఐలయ్యను సన్మానించి వీడ్కోలు పలికారు.

అంతరాయం లేకుండా కరెంటు ఇవ్వాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



ఎమ్మెల్యే కడియంను సత్కరిస్తున్న అధికారులు

జనగామ: విద్యుత్ సమస్య ఉన్న గ్రామాల్లో అంతరాయం లేకుండా కరెంటు సరఫరా చేయడానికి సత్వర చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో గృహ, పరిశ్రమలు, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందించడానికి కొత్తగా మూడు 33/11కేవీ సబ్‌స్టేషన్లు, రఘునాథపల్లిలో 220 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు నివేదికలు సిద్ధం చేస్తే మంజూరు కోసం ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఏటా వెయ్యి మంది రైతులు వ్యవసాయ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నందున తగినట్టుగా ప్రణాళికలను రూపొందించుకోవాలని, చెప్పారు. వ్యవసాయ పొలాలు, ఇళ్లపై ప్రమాదకరంగా ఉన్న హైటెన్షన్ వైర్ల తొలగింపు చర్యలు చేపట్టాలన్నారు. నిధుల కొరత లేకుండా ప్రభుత్వం నుంచి తీసుకువస్తామని తెలిపారు. మండలానికి రెండు సెక్షన్లు చేయాలని సూచించారు. అనంతరం కడియంను సత్కరించారు. సమావేశంలో ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ డీఈలు లక్ష్మీనారాయణ, హుస్సేన్‌నాయక్, ఎమ్మార్టీ డీఈ విజయ్‌కుమార్, టెక్నికల్ డీఈ గణేష్, ఎస్ఏఓ జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సైనికులకు సన్మానం



ఉద్యోగ విరమణ చేసిన సైనికులను సన్మానిస్తున్న పీఎంఏఈఓఎస్ నాయకులు

జనగామ రూరల్: నేవీ, సీఐఎస్ఎఫ్‌లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన సైనికులను శుక్రవారం పారా మిలటరీ ఎంప్లాయీస్ సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించారు. జిల్లా కేంద్రంలోని సొసైటీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు దేగల సంపత్ మాట్లాడుతూ నేవీలో 15 ఏళ్ల పాటు ఎం.ప్రకాష్, సీఐఎస్ఎఫ్ హెడ్‌కానిస్టేబుల్‌గా 22 ఏళ్లు విధులు నిర్వహించిన పి.కిరణ్‌కుమార్ సేవలను గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ ఉడుత మహేందర్, అజ్మీరా రమేష్, వేల్పుల కిరణ్ కుమార్, నీరటి సుధాకర్, అనిల్, ఉడుత నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల వెలికితీతకు శిక్షణ



రోబోటిక్స్‌పై అవగాహన కల్పిస్తున్న సహదేవ్

జనగామ రూరల్/బచ్చన్నపేట: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు, సృజనాత్మకతను వెలికి తీయడానికి శిక్షణ ఇస్తున్నట్లు రోబోటిక్స్ ఇన్ అకాడెమిక్స్ ప్రోగ్రాం వ్యవస్థాపకులు కోమరగిరి సహదేవ్ అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని సోషల్ వెల్ఫేర్, బచ్చన్నపేటలోని ఆదర్శ పాఠశాలలో సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యాన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు అభివృద్ధి చెందుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. మూడేళ్ల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 15 జిల్లాల్లో 255 పాఠశాలల్లో 43,417 మందికి రోబోటిక్స్‌పై అవగాహన కల్పించినట్లు వివరించారు. కోచ్ భవానీ పాల్గొన్నారు.

అప్పీలుకు 90 రోజులు కేటాయించాలి

- ఫీల్డ్ సర్వే ఆధారంగానే భూముల హద్దులు చూపించాలి
- పహాణీలు కొనసాగాలి.. సర్వేయర్ల కొరత తీర్చాలి
- నూతన ఆర్ఓఆర్ చట్టం ముసాయిదాపై చర్చ



మాట్లాడుతున్న రిటైర్డ్ తహసీల్దార్ శంకరయ్య, వేదికపై అదనపు కలెక్టర్, ఆర్డీఓ, ఇతర అధికారులు



జనగామ: భూములకు సంబంధించిన కేసుల విషయంలో అప్పీలుకు 90 రోజుల సమయం కేటాయించాలి.. రెవెన్యూ కోర్టులు కాకుండా జ్యుడీషియల్ కోర్టులను తీసుకురావాలి.. పర్యవేక్షణకు ప్రతీ గ్రామంలో వీఆర్వో.. కొరత లేకుండా సర్వేయర్లను నియమిస్తే నూతన ఆర్ఓఆర్ చట్టం విజయవంతంగా ముందుకు వెళ్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. నూతన ఆర్ఓఆర్ చట్టం-2024 ముసాయిదాపై శుక్రవారం కలెక్టరేట్‌లో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ ఆధ్వర్యాన నిర్వహించిన చర్చా వేదికలో వివిధ రంగాల ప్రజలు, రైతులు, సామాజిక కార్యకర్తలు, మేధావులు పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ మాట్లాడుతూ నూతన ఆర్ఓఆర్ చట్టం రూపకల్పనలో ప్రభుత్వం ప్రజలు, రైతులు, రైతు సంఘాల నాయకులు, సీనియర్ అధికారులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తల నుంచి అభిప్రాయాలు సేకరించిందని చెప్పారు. జనగామ ఆర్డీఓ కొమురయ్య మాట్లాడుతూ భూముల రికార్డింగ్ అథారిటీ తహసీల్దార్‌లకు ఇచ్చి, అప్పీల్ అధికారాలను ఆర్డీఓలకు, రీ అప్పీల్ అధికారాలను కలెక్టర్లకు ఇస్తే సివిల్ కోర్టును ఆశ్రయించే విధంగా ఉంటుందన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్న మాట్లాడుతూ ఎంతో వేగంగా, సులభ రీతిలో పనులయ్యే విధంగా చట్టాన్ని తీసుకొస్తున్నట్లు తెలిపారు. స్టేషన్‌ఘనపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకం రమేష్ మాట్లాడుతూ నూతన ఆర్ఓఆర్ చట్టాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సామాజిక కార్యకర్త కిష్టయ్య మాట్లాడుతూ భూముల సర్వే అనంతరం భూదార్ ఇస్తే బాగుంటుందని పేర్కొన్నారు. మ్యుటేషన్ పాత సర్వే నంబర్‌లోనే కేటాయించి, ప్రతీ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమించాలని, సిబ్బంది కొరత లేకుండా చూడాలని సూచించారు. సాధిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది సాధిక్ అలీ మాట్లాడుతూ భూముల వివరాలను ఆన్‌లైన్ కాకుండా పేపర్‌పై రాసి ఇచ్చేలా రూపకల్పన చేయాలన్నారు. జమాబందీ ఉండే విధంగా చూసి, ఎంతో కొంత భూమి శిస్తు నిర్ణయించి అప్పీలుకు 90 రోజుల సమయం కేటాయించాలని సూచించారు. రెవెన్యూ కోర్టులు కాకుండా జ్యుడీషియల్ కోర్టులను తీసుకురావాలని, 3 నుంచి 4 నెలల పేషీల్లో భూముల కేసులను ముగించేలా చట్టం ఉండాలని అభిప్రాయపడ్డారు. బచ్చన్నపేట మండలం తమ్మడపల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఫీల్డ్ సర్వే చేయకుండా హద్దులు చూపించొద్దని, రైతు, ప్రభుత్వ, ఇతర వాటికి అసలు భూమి ఎంత ఉందనే సమగ్ర సమాచారం ఉండాలన్నారు. పహాణీలను కొనసాగించాలని పేర్కొన్నారు. తరిగొప్పుల తహసీల్దార్ చారి మాట్లాడుతూ పహాణీలు తప్పనిసరిగా ప్రింట్ అవుట్ తీసుకోవాలని, మ్యుటేషన్, సక్సేషన్ కేసులకు ఎలాంటి వసూళ్లు చేయకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ, వివిధ మ్యుటేషన్లలో వేరుగా విడిపోయిన భూములను సరిచేసి భవిష్యత్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విశ్రాంత తహసీల్దార్ శంకరయ్య, సంబంధిత రెవెన్యూ అధికారులు చర్చా వేదికలో పాల్గొన్నవారి సందేహాలను నివృత్తి చేశారు.

కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు



వైభవంగా కల్యాణోత్సవం

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని బాణాపురం శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్‌కుమార కృష్ణమాచార్యుల ఆధ్వర్యాన లక్ష్మీనారాయణ స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన 1008 మంది సౌభాగ్యవతులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య అమలులో అంగన్‌వాడీలు కీలకం

- జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి జయంతి



అంగన్‌వాడీ టీచర్లతో మాట్లాడుతున్న జయంతి

దేవరుప్పుల : ప్రాథమిక విద్య అమలులో అంగన్‌వాడీ టీచర్ల పాత్ర కీలకమని, ఇందుకు అనుగుణంగా పనిచేయాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి జయంతి అన్నారు. శుక్రవారం కామారెడ్డిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో నూతన విధి, విధానాల అమలుపై అవగాహన కల్పించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు దీటుగా తరగతులు నిర్వహిస్తూ మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని జయంతి చెప్పారు. గర్భిణుల సంక్షేమంతో పాటు పుట్టిన శిశువుకు ఆరు నెలలపాటు ముర్రుపాలు పట్టించేలా అవగాహన కల్పించాలని అన్నారు. పిల్లలకు ఓనమాలు నేర్పి ప్రాథమిక పాఠశాలకు పంపే ప్రక్రియలో అంగన్‌వాడీ సేవలపై నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. ప్రతి కేంద్రంలో ప్రీ స్కూల్ అమలు చేస్తూ పది మందికి పైగా పిల్లలు ఉండేలా పాటుపడాలన్నారు. ప్రతి నెలా పిల్లల అభివృద్ధి తదితర అంశాలపై గృహ సందర్శనలు చేసేలా పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మిషన్ శక్తి ప్రతినిధి శారద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శ్రీదేవి, సావిత్రి, దూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాహనం నుంచి పడిన తుపాకీ

- పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన ఆటోడ్రైవర్

వరంగల్ : భీమారంలోని సీఆర్పీఎఫ్ 58వ బెటాలియన్ నుంచి మణిపూర్‌కు వెళ్తున్న సైనికుల వాహనం నుంచి తుపాకీ (కార్బన్) పడిపోయింది. కాగా పైడిపల్లికి చెందిన ఆటో డ్రైవర్ ధరావత్ శ్రీను వరంగల్ వైపునకు ఆటోతో వెళ్తుండగా ఎంజీఎం జంక్షన్‌లో రోడ్డుపై తుపాకీ(కార్బన్) కనిపించింది. వెంటనే దానిని తీసుకొని మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌చార్జ్ హెడ్ కానిస్టేబుల్ ధర్మానాయక్‌కు అప్పగించాడు. కొద్ది నిమిషాల్లోనే తుపాకీ సిల్లింగ్ ఊడిపోయి వాహనం నుంచి జారిపడిన శబ్దం వచ్చిందని, ఆ ప్రాంతంలో పరిశీలిస్తే తుపాకీ కనిపించలేదని సీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ రాజేష్ కుమార్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. దీంతో అక్కడే ఉన్న తుపాకీని చూసి ఇది తనదే అని చెప్పాడు. దీంతో పోలీసులు అతని వివరాలు తీసుకుని తుపాకీ (కార్బన్) అతనిదేనని నిర్ధారించుకొని అప్పగించారు. ఈ విషయాన్ని వెంటనే ఉన్నత స్థాయి అధికారులకు తెలియజేసినట్లు మట్టెవాడ పోలీసులు పేర్కొన్నారు.

టెక్నాలజీతో పారదర్శకత

- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి


మాట్లాడుతున్న మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ : ఉద్యోగులు తమ విధుల నిర్వహణలో టెక్నాలజీ వినియోగంతో పారదర్శకత సాధ్యపడుతుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఎంపిక చేసిన వారికి నాలుగు వారాల కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంలో భాగంగా యూనివర్సిటీ కంప్యూటర్స్ విభాగంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంఎస్ ఎక్సెల్ వినియోగంతో లెక్కలు, పద్దులు, జీతాల బిల్లుల తయారీలో మెళకువలు నేర్చుకోవాలని మల్లారెడ్డి ఉద్యోగులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ రమ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యుడిపై కేసు


సీజ్ చేసిన మందులు చూపుతున్న అధికారులు

లింగాలఘణపురం : మండలంలోని నవాబుపేటకు చెందిన అలికట్టి కృష్ణ ఎలాంటి అర్హత లేకుండా క్లినిక్ నిర్వహిస్తున్నాడు. అంతేకాకుండా అనుమతి లేని అల్లోపతి మందులను విక్రయించేందుకు నిల్వ చేయడంతో కేసు నమోదైంది. శుక్రవారం ఔషధ నియంత్రణ శాఖ సంచాలకులు డాక్టర్ రాజ్యలక్ష్మి పర్యవేక్షణలో జనగామ, వరంగల్ జిల్లా ఔషధ తనిఖీ అధికారులు బాలకృష్ణ, అరవింద్ ఆధ్వర్యంలో సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో సుమారు రూ.25వేల విలువైన మందులను సీజ్ చేసి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో సమర్పించారు.

రూ.200కోట్ల పైనే..

పేరుకుపోయిన లైబ్రరీ పన్ను

- చెల్లించాలని కార్పొరేషన్‌కు గ్రంథాలయ సంస్థ ప్రతిపాదనలు
- ఏళ్ల తరబడి భర్తీకాని ఖాళీలు

హన్మకొండ చౌరస్తా : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు.. అందుకే చినిగిన చొక్కా అయినా వేసుకో మంచి పుస్తకం కొనుక్కో అని మహనీయులు బోధించారు.మారుతున్న కాలానికి అనుగుణంగా, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని గ్రంథాలయాలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. కానీ పదేళ్లలో కేంద్ర ప్రభుత్వ నిధులతో వరంగల్ సెంట్రల్ లైబ్రరీ, హనుమకొండ జిల్లా గ్రంథాలయాలు మాత్రమే వసతుల కల్పనకు నోచుకున్నాయి. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధానమైన వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని 90 శాతానికి పైగా గ్రంథాలయాలు అరకొర వసతులు, సిబ్బంది లేమితో నెట్టుకొస్తున్నాయి. పదేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయ శాఖలోని ఖాళీ ఉద్యోగాలను భర్తీ, వసతుల కల్పన కోసం తీసుకున్న చర్యలు శూన్యం.


హనుమకొండ జిల్లా కేంద్ర గ్రంథాలయం

సెస్ అంటే..

గ్రంథాలయాల నిర్వహణకు నిధుల సేకరణ కోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించారు. అందుకోసం గ్రంథాలయాలను స్థానిక సంస్థల పరిధిలో చేర్చుతూ అప్పటి ప్రభుత్వం 1960లో ఓ చట్టాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రంలోని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్లకు ప్రజలు చెల్లిస్తున్న వివిధ పన్నులలో 8 శాతం గ్రంథాలయాలకు కేటాయించాలని చట్టం చెబుతోంది. పంచాయతీ, మున్సిపల్, కార్పొరేషన్‌ల నుంచి వచ్చే 8 శాతం నిధులతో గ్రంథాలయాల నిర్వహణ, వసతుల కల్పన, ఉద్యోగాల భర్తీ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేసుకునేలా చట్టాన్ని రూపొందించారు.

ఖాళీలు ఇలా..

గ్రేడ్-2 లైబ్రేరియన్‌లు ముగ్గురికి గానూ హనుమకొండ, పరకాల లైబ్రరీలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆత్మకూర్, శాయంపేట, వంగర, ఎల్కతుర్తి, కమలాపూర్, భీమదేవరపల్లి శాఖ గ్రంథాలయాల్లో గ్రేడ్-3 లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హనుమకొండ జిల్లా గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ పోస్టులు(2) ఖాళీగా ఉన్నాయి. అటెండర్లు హనుమకొండ, హసన్‌పర్తి, పరకాల, ఆత్మకూర్‌లో (6) అటెండర్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. పబ్లిక్‌గార్డెన్‌లో బాలల గ్రంథాలయం, పరకాలకు వాచ్‌మన్ (2) పోస్టులు, హనుమకొండ గ్రంథాలయంలో (2) బుక్‌బైండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

వరంగల్‌లో ఖాళీలు..

నర్సంపేటలో గ్రేడ్-2 లైబ్రేరియన్ (1), పర్వతగిరి, రాయపర్తి, ఖానాపూర్, సంగెం, నల్లబెల్లి, చెన్నారావుపేట, దుగ్గొండి, నెక్కొండ, గీసుకొండ, వర్ధన్నపేట శాఖ గ్రంథాలయాలకు గ్రేడ్-3 లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వరంగల్, పర్వతగిరి, వర్ధన్నపేట లైబ్రరీలో-3 అటెండర్ పోస్టులు, రాయపర్తి, నర్సంపేటలో-2 వాచ్‌మన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

పదేళ్లలో చెల్లించాల్సిన సెస్ రూ.200 కోట్ల పైనే..

వరంగల్, హనుమకొండ జిల్లా గ్రంథాలయాలకు సెస్ నిధులను గడిచిన పదేళ్లలో ఒక్క రూపాయి చెల్లించలేదు. అనధికారిక లెక్కల ప్రకారం 2014 నుంచి 2024 వరకు హనుమకొండ, వరంగల్ జిల్లాలకు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రావాల్సిన సెస్ దాదాపు రూ.200ల కోట్లకు పైనే ఉంటాయని గ్రంథాలయ సంస్థ తెలియజేస్తుంది. అధికారికంగా లెక్కలు తీస్తే రూ.400ల కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

సాంకేతిక లోపంతో చెల్లింపులు లేవు?

మున్సిపల్ కార్పొరేషన్ ప్రతి ఏటా రూపొందించే డిమాండ్ కలెక్షన్ బ్యాలెన్స్ ప్రకారం చెల్లింపులు జరుగుతున్న పన్నులలో చట్ట ప్రకారం గ్రంథాలయ సంస్థకు రావాల్సిన 8 శాతం వాటాను అంచనా వేస్తుంటారు. గ్రంథాలయ సంస్థ అంచనా ప్రకారం గత పదేళ్లలో రావాల్సిన వాటా రూ.200ల కోట్లకు పైగా ఉంటుందని చెబుతున్నారు. గ్రంథాలయాలకు సెస్ చెల్లింపుల కోసం తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు.అయితే సాంకేతిక కారణాల వల్ల సెస్ చెల్లింపులో జాప్యం జరుగుతుందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. లైబ్రరీ యాక్ట్-1960 ప్రకారం చెల్లించాల్సిన 8శాతం సెస్‌లో గత పదేళ్లుగా బకాయి ఉన్నట్లు గ్రంథాలయ సంస్థ అధికారులు చెబుతున్నారు.

సీఎం దృష్టికి తీసుకెళ్తా..



యువతకు మార్గదర్శకంగా తీర్చిదిద్దాల్సిన గ్రంథాలయాలను గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. పదేళ్లు గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో ఇటీవల సమావేశం నిర్వహించాం. రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాల దుస్థితి, అభివృద్ధి, సెస్ ఇతర సమస్యలను త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తా. పటిష్టమైన ప్రణాళికతో గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తాం.

– మహ్మద్ రియాజ్, చైర్మన్ తెలంగాణ గ్రంథాలయ పరిషత్

బకాయి అంచనా పంపించాం..



మున్సిపల్ కార్పొరేషన్ డిమాండ్ కలెక్షన్ బ్యాలెన్స్ ప్రకారం లైబ్రరీకి రావాల్సిన 8 శాతం సెస్ అంచనా వేసి ప్రతిపాదనలను కార్పొరేషన్‌కు అందజేశాం. అంచనా ప్రకారం రూ.200ల కోట్లకు పైనే రావాల్సి ఉంది. పదేళ్లకు చెల్లించాల్సిన మొత్తాన్ని గ్రంథాలయానికి అందజేస్తే జిల్లాలోని ఆయా గ్రంథాలయాల్లో ఖాళీలను భర్తీ చేసి, నిర్వహణ భారం ప్రభుత్వంపై పడకుండా ఉంటుంది.

– శశిజాదేవి, కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ, హనుమకొండ

వరంగల్ మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

వరంగల్ : ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా మూడు రోజులు సెలవుల కారణంగా బంద్ ఉంటుందని మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. 24న శనివారం(వారంతపు యార్డు బంద్), 25న ఆదివారం(వారంతపు సెలవు), 26న సోమవారం(శ్రీకృష్ణజన్మాష్టమి) ఉన్నందున శనివారం నుంచి సోమవారం వరకు మార్కెట్ బంద్ ఉంటుందని తెలిపారు. 27వ తేదీ మంగళవారం మార్కెట్ పునఃప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఈవిషయాన్ని రైతులు, వ్యాపారస్తులు, గుమాస్తా, దడువాయి, కార్మికులు గమనించాలని కోరారు.

నిట్‌లో నేషనల్ స్పేస్ డే


స్పేస్ డే వేడుకలో ఇస్రో సైంటిస్ట్ వీఎం.చౌదరి

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లో శుక్రవారం నేషనల్ స్పేస్ డేను ఘనంగా నిర్వహించారు. నేషనల్ స్పేస్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్సీ) ఇస్రో సైంటిస్ట్ డాక్టర్ వీఎం.చౌదరి హాజరై నగరంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే పరిశోధనలపై ఆసక్తిని పెంపొందించుకుని సైంటిస్ట్‌లుగా రాణించాలని, స్పేస్ పై పరిశోధనలను చేపట్టేందుకు సిద్ధం కావాలని సూచించారు. ఆహార భద్రత కోసం స్పేస్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత ట్రెండ్ చంద్రుడి అన్వేషణలో కొనసాగుతుందని ఇందుకు విద్యార్థులు ఆసక్తిని పెంపొందించుకుని ముందుకు సాగాలని స్కైరూట్ ఏరోస్పేస్ ఇస్రో వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సీఎస్.కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ, ప్రొఫెసర్లు శిరీష్ సోనావానే, ఆంజనేయులు, హరినాథ్, సంపత్ కుమార్, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కొడుకు మృతి
తట్టుకోలేక పినతల్లి హఠాన్మరణం

- తండ్రికి తలకొరివి పెట్టిన ఐదేళ్ల కుమారుడు
- మహబూబాబాద్ పరిధిలోని శనిగపురంలో విషాదం


మంద రవి(ఫైల్)


మంద జ్యోతి(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : అనారోగ్యంతో పాటు మనోవేదనకు గురైన కొడుకు చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతడిని చూసేందుకు వచ్చిన పినతల్లి గుండెపోటుతో తుదిశ్వాస విడిచింది. ఏం జరుగుతుందో తెలియని ఐదేళ్ల చిన్నారి కన్నతండ్రికి తలకొరివిపెట్టిన విషాదకర సంఘటన శుక్రవారం శనిగపురంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామానికి చెందిన మంద వెంకన్న రైల్వేలో ట్రాక్‌మన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు భార్య స్వరూప, ఇద్దరు కుమారులు మంద రవి(32), వంశీ, కుమార్తె ఉన్నారు. భార్య స్వరూప ఇరవై ఏళ్ల క్రితం మృతిచెందగా వెంకన్న చిన్నగూడురు మండలం జయ్యారం గ్రామానికి చెందిన జ్యోతిని రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెకు కూతురు సంగీత, కుమారుడు సాయి ఉన్నారు. అయితే వెంకన్న అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతిచెందగా కొద్ది రోజుల తర్వాత జ్యోతి తన కుమారుడు, కుమార్తెతో ఖమ్మంలోని అగ్రహారం కాలనీలో నివాసం ఉంటుంది. ఈ క్రమంలో కుమారుడు సాయి రైల్వే ఉద్యోగంలో చేరగా, రవి ఆటో నడుపుతూ భార్య స్వప్న, ఐదేళ్ల కుమారుడు నవనీత్‌తో ఉంటున్నాడు. మారుతల్లి (పినతల్లి) ఖమ్మంకు వెళ్లిన కొంతకాలం నుంచి వారి మధ్య కుటుంబ, ఆస్తి, ఉద్యోగం విషయంలో తగాదా నేపథ్యంలో కోర్టులో కేసు నమోదైంది. అలాగే ఏడాది క్రితం రవి భార్య స్వప్న తన తల్లిగారింటికి వెళ్లిపోగా అన్ని రకాల సమస్యలతో మనోవేదనకు గురై రవి కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. రవి మృతి సమాచారాన్ని పెంచిన తల్లి జ్యోతికి తెలియజేయగా ఆమె శుక్రవారం ఉదయం శనిగపురం గ్రామానికి వచ్చి అతడి మృతదేహాన్ని చూసి రోదిస్తూ తట్టుకోలేక అక్కడే కుప్పకూలి పడిపోయింది. వెంటనే స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆమె గుండెపోటుతో మృతిచెందిదని తెలిపారు.


కుండపట్టి తండ్రికి తలకొరివి పెట్టేందుకు వెళ్తున్న కుమారుడు నవనీత్

శనిగపురం గ్రామంలో విషాదఛాయలు..

మంద రవిని చూసేందుకు వచ్చి మారుతల్లి (పినతల్లి) జ్యోతి హఠాన్మరణం చెందగా శనిగపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రి రవికి ఐదేళ్ల కుమారుడు నవనీత్ తలకొరివి పెట్టడంతో గ్రామస్తులు కంటతడి పెట్టుకున్నారు. ఇంత చిన్నవయసులో ఎంత కష్టం వచ్చింది బిడ్డా..అని కన్నీటి పర్యంతమయ్యారు.

'ఓపెన్'గా చదివేద్దాం..

- అంబేడ్కర్ వర్సిటీలో నాణ్యమైన విద్య
- డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందాలి
- యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు, పక్కన ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు

కేయూ క్యాంపస్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ(యూజీ) బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లోను, పీజీ ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, బీఎల్ఐఎస్సీ, ఎంఎల్ఐఎస్సీ తదితర డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 31వ తేదీలోగా ఆసక్తిగల అభ్యర్థులు ప్రవేశాలు పొందాలని హైదరాబాద్‌లోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలోని అంబేడ్కర్ యూనివర్సిటీ వరంగల్ ప్రాంతీయ అధ్యయన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రీజినల్ కోఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు కారణాలతో రెగ్యులర్ విద్యను నిలిపి వేసిన విద్యార్థులు కూడా ఓపెన్ యూనివర్సిటీలో చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. డిగ్రీ కోర్సులు సెమిస్టర్ సిస్టంలోను, పీజీ కోర్సులు ఇయర్‌వైజ్ స్కీంలో నిర్వహిస్తున్నామన్నారు. కాంటాక్ట్ తరగతులతో పాటు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్నామన్నారు. వివిధ వృత్తిలో పనిచేస్తూ కూడా ఓపెన్ వర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సులను పూర్తిచేసుకునే అవకాశం ఉందన్నారు.తెలంగాణ రాష్ట్రంలోని స్టడీ సెంటర్లలో ప్రవేశాలు పొందేందుకుగాను విద్యార్హతలు, ఫీజులు, కోర్సుల వివరాలను ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓయూఆన్‌లైన్.ఇన్ లేదా డబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓయూ.ఏసీ.ఇన్‌లో పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతి ప్రొఫెసర్ రజని, ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబు, డాక్టర్ ఆదిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ఫీజు చెల్లించాలి

ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈనెల 31వ తేదీలోపు ట్యూషన్ ఫీజు చెల్లించాలని వర్సిటీ జేడీ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పూర్తి సమాచారం కోసం, సందేహాలుంటే సమీపంలోని అధ్యయన కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. డిగ్రీ, పీజీ పూర్వవిద్యార్థులు రెండో, మూడో సంవత్సరంలో సకాలంలో ఫీజులు చెల్లించలేకపోయిన వారు 2015-16నుంచి 2023-24వరకు అడ్మిషన్లు పొంది ఉంటే వారు కూడా ఫీజులు చెల్లించేందుకు ఈనెల 31వరకు గడువు ఉందని తెలిపారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పీజీ కోర్సుల పరీక్షలు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నారు. కాగా పరీక్ష కేంద్రాన్ని యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లుతో పాటు ప్రొఫెసర్ రజని తనిఖీ చేశారు.

1న జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్ : సెప్టెంబర్ 1వ తేదీన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-5 నుంచి అండర్-18 బాలబాలికల రోలార్ స్కేటింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు వరంగల్ స్కేటింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండి సిద్దార్థ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాంపూర్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో నిర్వహించే ఎంపికలలో పాల్గొనే క్రీడాకారులు తమ పేర్ల ను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 63015 91754, 83318 14164 నంబర్‌లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రజల దృష్టి మరల్చేందుకే ఆరోపణలు

- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ
- కొనసాగుతున్న రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు


రాజాకు చెక్కు అందజేస్తున్న నాయకులు

సాక్షిప్రతినిధి, వరంగల్ / న్యూశాయంపేట : తెలంగాణలో ప్రజా సమస్యల నుంచి దృష్టిని మరల్చేందుకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ ఫిరాయింపులపై పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ అన్నారు. హనుమకొండలో జరుగుతున్న సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి నిర్మాణ సమావేశాల సందర్భంగా శుక్రవారం కాకతీయ హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులతో కలిసి నారాయణ మాట్లాడారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనమవుతుందని సీఎం రేవంత్ రెడ్డి చెబుతుండగా, రేవంత్ రెడ్డే బీజేపీలో చేరుతారని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని ఉదహరించారు. ఆయా పార్టీలు కలిసి రాజకీయ క్రీడ ఆడుతున్నాయని ఎద్దేవా చేశారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సీపీఐ స్వాగతిస్తోందని, అయితే వర్గీకరణకు, క్రిమిలేయర్ సంబంధం లేదని, కోర్టులో విచారణ సందర్భంగా తాము ఈ విషయాన్ని తెలియజేస్తామన్నారు. మాజీ ఎంపీ అజీజ్‌పాషా మాట్లాడుతూ.. బడ్జెట్‌లో వైద్య రంగానికి కేవలం 1.35 శాతం ఖర్చు చేయడం సిగ్గుచేటని, ఇది వైద్య రంగంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు శనివారంతో ముగుస్తాయని తెలిపారు. ముగింపు సమావేశాల్లో కీలక నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని, వాటిని ప్రకటిస్తామన్నారు. సమావేశంలో సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్ రెడ్డి, తక్కెళ్లపల్లి శ్రీనివాస్, పశ్యపద్మ, కలవేణ శంకర్, ఎం.బాలనరసింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.విజయ సారథి, మర్రి వెంకటస్వామి, హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు సీపీఐ విరాళం

వయనాడ్ బాధితుల కోసం సీపీఐ రాష్ట్ర తెలంగాణ సమితి రూ.5.41లక్షల ఆర్థికసాయాన్ని అందించింది. ఈ మేరకు హనుమకొండలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా శుక్రవారం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాకు రాష్ట్ర సమితి తరఫున పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చెక్కును అందజేశారు.

డెంగీతో యువకుడి మృతి


కాలేష్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్ : ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన కడమంచి కాలేష్(31) డెంగీతో బాధపడుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. దినసరి కూలీ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న కాలేష్‌కు భార్య, నెలరోజుల వయస్సు ఉన్న ఇద్దరు కవల ఆడపిల్లలు ఉన్నారు. కాగా జ్వరంతో బాధపడుతున్న కాలేష్ ఐదు రోజుల క్రితం స్థానికంగా వైద్యం చేయించుకున్నాడు. అయినా జ్వరం తగ్గకపోవడంతో రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్క డి వైద్యులు డెంగీ జ్వరంగా నిర్ధారించి చికిత్స అందించారు. అయితే రక్తకణాలు తగ్గడంతో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. కాలేష్ డెంగీతో మృతి చెందడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్య, దోమల నివారణకు పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

విషజ్వరంతో బాలిక..


నిత్యశ్రీ (ఫైల్)

గీసుకొండ : మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన దూల మహేందర్-శ్రీలత దంపతుల కూతురు నిత్యశ్రీ (9) విషజ్వరంతో మృతి చెందింది. రెండ్రోజుల క్రితం నిత్యశ్రీకి తీవ్ర జ్వరం రాగా తల్లిదండ్రులు ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.అయితే గురువారం రాత్రి వాంతులు, విరేచనాలు కావడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చేందిందని తెలిపారు. అయితే బాలికకు ఫిట్స్ రావడంతో బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెంది ఉంటుందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

రెండు కార్లు ఢీ.. ఒకరి మృతి


ఘటనా స్థలిలో నుజ్జునుజ్జయిన కార్లు

శాయంపేట : ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి కాలు విరిగింది. మిగిలిన వారికి స్వల్ప గాయాలైన సంఘటన శుక్రవారం సాయంత్రం కొత్తగట్టు సింగారం శివారులో చోటు చేసుకుంది. ఎస్సై ప్రమోద్‌కుమార్ కథనం ప్రకారం.. వరంగల్‌లోని నాయుడు పెట్రోల్ పంపు ప్రాంతానికి చెందిన జన్ను ఎల్లయ్య, నాగమ్మ, నరేందర్, సబితారాణి పరకాలలో తమ బంధువుల వివాహానికి హాజరై కారులో తిరిగి ఇంటికి వెళ్తున్నారు.అదే విధంగా భూపాలపల్లి చెందిన సిలువేరి శివకుమార్, ఉదయ్‌కుమార్, మమత, పద్మావతి, అద్వికరాయ్ వరంగల్ నుంచి భూపాలపల్లికి కారులో వెళ్తున్నారు. పరకాల-హనుమకొండ ప్రధాన రహదారిలోని కొత్తగట్టు సింగారం శివారులో వీరు ప్రయాణిస్తున్న కార్లు ఎదురెదురుగా అతివేగంతో వచ్చి ఢీకొనడంతో జన్ను మల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మల్లయ్య మృతి చెందాడు. మరో కారులో ప్రయాణిస్తున్న సిలువేరి పద్మావతి కాలు విరగగా మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

రెప్పపాటులో తప్పిన ప్రమాదం

- ప్రయాణికుడిని కాపాడిన రైల్వే పోలీస్


ప్రయాణికుడిని కాపాడుతున్న పోలీస్ (సీసీ ఫుటేజీ)

కాశిబుగ్గ : వరంగల్ రైల్వేస్టేషన్‌లో గురువారం రాత్రి కదులుతున్న రైలులో ఫుట్‌బోర్డ్‌పై వేళాడుతూ పడిపోతున్న ఓ ప్రయాణికుడుని ఆర్పీఎఫ్ పోలీసులు కాపాడారు. ఆర్పీఎఫ్ ఎస్సై జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం..ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా బిట్వాడ మండలం వీరగట్టుకు చెందిన అట్టాడ అన్నమనాయుడు వరంగల్ నుంచి చీపురుపల్లి వెళ్తున్నాడు. అయితే రైలు కదులుతుండగా అన్నమనాయుడు బ్యాగుతో పాటు రైలెక్కి ఫుట్‌బోర్డుపై వేళాడుతూ కింద పడిపోతుండగా ప్లాట్‌ఫాం-1లో విధులు నిర్వహిస్తున్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ మోహన్ గమనించి పరుగెత్తి ప్రయాణికుడిని చాకచక్యంగా బయటకు లాగాడు. రెప్పపాటులో ప్రయాణికుడు రైలు కింద పడిబోయేవాడని, కానిస్టేబుల్ మోహన్ కాపాడడంతో ఆర్పీఎఫ్ ఉన్నతాధికారులు, ప్రయాణికులు అభినందించారు. అనంతరం ప్రయాణికుడిని స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చి మరో రైలులో పంపించామని ఎస్సై తెలిపారు.